క్లుప్తంగా

సామాజిక సేవతోనే సంతృప్తి



కల్వకుర్తి రూరల్: సామాజిక సేవతోనే సంతృప్తి కలుగుతుందని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని జంగారెడ్డి పల్లిలో ఆంజనేయ స్వామి దేవాలయం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో ఆయన పాల్గొని పూజలు చేశారు. ఆలయానికి రంగులు వేసేందుకు రూ.5లక్షలు విరాళంగా ఇచ్చారు. అనంతరం ఆలయ నిర్వాహకులు మెమెంటోతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లింగారెడ్డి, నాయకులు అల్వాల్ రెడ్డి, బన్నె శ్రీధర్, పరమేశ్వర్, తిరుపతయ్య, లాలయ్య, శ్రీను, లింగం, బన్నె శ్రీను, మల్లయ్య, బుజ్జి రెడ్డి పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ సభ

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని ఉపాధి హామీ సమావేశం మందిరంలో శుక్రవారం మండలంలోని గ్రామ పంచాయతీల వారిగా నిర్వహించిన సామాజిక తనిఖీపై సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటరాములు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశంలో గ్రామ పంచాయతీల వారీగా నిర్వహించిన ఆడిట్ రిపోర్టులను చదివి వినిపిస్తారని పేర్కొన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తునట్లు ఏఎస్‌ఓ లత తెలిపారు. కంప్యూటర్ సైన్స్, ఎంపీఏడబ్ల్యూ కోర్సుల కోసం పదో తరగతి పూర్తైన బాలికలు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఆరో తరగతిలో ఖాళీ ఉన్న సీట్ల కోసం దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

ఆర్థిక సాయం అందజేత

చారకొండ: మండలంలోని జూపల్లి గ్రామానికి చెందిన కొప్పు చరణ్ కుమార్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వెల్దండ సింగిల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కర్ రావు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు.

నిత్యాన్నదానానికి విరాళం



అచ్చంపేట రూరల్: శ్రీశైల ఉత్తరముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి గురువారం యాదన్నపుడి జనార్దనాచారి రూ.25,116లు విరాళంగా అందజేశారు. దాత కుటుంబ సభ్యులను ఆలయ కమిటీ చైర్మన్ బీరం మాధవరెడ్డి, ఈఓ శ్రీనివాసరావు సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు పేదలకు వరం



తిమ్మాజిపేట: ఇందిరమ్మ ఇళ్లు పేదలకు వరమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్రామ్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని తుమ్మలకుంట తండాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లను నాణ్యతగా నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనారాయణ, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రాఘవేందర్, స్థానిక యువకులు వెంకటేష్, బద్దు, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శిపై డీపీఓకు ఫిర్యాదు

తాడూరు: మండలంలోని అల్లాపూర్ గ్రామానికి చెందిన పంచాయతీ కార్యదర్శి భరత్‌కుమార్‌రెడ్డిపై చర్య తీసుకోవాలని డీపీఓ రామ్మోహన్‌కు కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కాశన్న, బాధితులు కుర్మయ్య ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన కుర్మయ్య పార్వతమ్మ దంపతులు ఇంటికి సంబంధించిన ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకోగా 20 రోజుల నుంచి ఇబ్బందులకు గురి చేస్తున్నారని వివరించారు. ధ్రువీకరణ పత్రం ఇప్పించే విధంగా చూడాలని విజ్ఞప్తి చేశారు.

సమస్యల పరిష్కారానికే భూ భారతి



పంజుగుల రెవెన్యూ సదస్సులో రైతుల దరఖాస్తు పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

కల్వకుర్తి రూరల్: భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. గురువారం మండలంలోని పంజుగులలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సును ఆకస్మికంగా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దరఖాస్తు ఇవ్వడానికి వచ్చిన రైతులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తులపై అక్కడే సమీక్ష నిర్వహించారు. దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ నమోదు చేయాలన్నారు. దరఖాస్తులను స్వీకరించిన తర్వాత రశీదు ఇవ్వాలని సూచించారు. దరఖాస్తులను వర్గీకరించి పక్కాగా రికార్డులు తయారు చేయాలని ఆదేశించారు. ఈనెల 20వ తేదీ వరకు సదస్సులు నిర్వహించాలని కోరారు. పొరపాట్లు చేస్తే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఆర్డీఓ శ్రీనునాయక్, తహసీల్దార్ ఇబ్రహీం, డిప్యూటీ తహసీల్దార్ కల్మచర్ల రాఘవేందర్ సిబ్బంది ఉన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

మన్ననూర్: అమ్రాబాద్ మండలంలోని మాచారంలో రైతుల నుంచి అమ్రాబాద్ తహసీల్దార్ శైలేంద్ర కుమార్ దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి కోరె రేణయ్య, అధికారులు వెంకటేష్, బొంత జగన్, రమేష్, బాలస్వామి, రామాంజనేయులు, అశోక్, బాల కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

లింగాల: రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అచ్చంపేట ఆర్డీఓ మాధవి రైతులను కోరారు.మండలంలోని బాకారంలో నిర్వహించిన గ్రామసభలో ఆర్డీఓ పాల్గొని రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పాండునాయక్,కాంగ్రెస్ నాయకులు రంగినేని శ్రీనివాస్‌రావు,రైతులు పాల్గొన్నారు.

తిమ్మాయిపల్లిలో..

చారకొండ: మండలంలోని తిమ్మాయిపల్లిలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. తహసీల్దార్ అద్దంకి సునీత హాజరై దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీను నాయక్, ఆర్‌ఐ భరత్ కేమార్ గౌడ్, జూనియర్ అసిస్టెంట్ రాజు వందన, గ్రామ నాయకులు జైపాల్, శ్రీపతి రావు, నాగర్జున రమేష్, వెంకటయ్య, రామస్వామి రైతులు తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల పరిశీలన

పెద్దకొత్తపల్లి:మండలంలోని తిర్మాల్‌పల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో దరఖాస్తులను కొల్లాపూర్ ఆర్డీఓ బన్సీలాల్ పరిశీలించారు. మొత్తం 127 దరఖాస్తులు వచ్చినట్లు డీటీ రమేష్‌నాయక్ తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, పంచాయితీ కార్యదర్శి పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు ఏర్పాటు

వెల్దండ: మండలంలోని పెద్దాపూర్, కోనేటివాడలో రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. కల్వకుర్తి ఆర్డీఓ శ్రీనునాయక్ హాజరై మాట్లాడారు. రైతులు భూ భారతి, రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పెద్దాపూర్‌లో 13, కోనేటివాడలో 7 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో తహసీల్దార్ కార్తీక్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఆర్‌ఐలు, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

79 ఫిర్యాదులు

కోడేరు: మండలంలోని జనుంపల్లి, ఎత్తం గ్రామాల్లో 79 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో సురేందర్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఓ ఆకస్మిక తనిఖీ

బిజినేపల్లి:మండలంలోని కారుకొండలో రెవెన్యూ సదస్సును ఆర్డీఓ సురేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్ ఉన్నారు.

■ అదేవిధంగా తాడూరు మండలంలోని తిరుమలాపూర్, అంతారం, తిమ్మాజిపేట మండలంలోని మరికల్, కోడుపర్తి, తెలకపల్లి మండలంలో బొప్పల్లి, నడిగడ్డలో, కొల్లాపూర్ మండలంలోని రామాపురం, చెన్నంపల్లి సదస్సులు నిర్వహించారు.



బాకారం గ్రామసభలో దరఖాస్తులను స్వీకరిస్తున్న ఆర్డీఓ మాధవి



బిజినేపల్లిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఆర్డీఓ సురేష్



పెద్దాపూర్‌లో దరఖాస్తులను పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనునాయక్, రెవెన్యూ అధికారులు



తిర్మాల్‌పల్లి రెవెన్యూ సదస్సులో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ బన్సీలాల్

మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి టౌన్: మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రభు త్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారా యణరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని పలు వార్డులలో అభివృద్ధి పనులకు శంకుస్థాన చేశారు. అనంతరం 100 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. మున్సిపాలిటీల అభివృద్ధి కోసం ప్రభుత్వం 100 రోజుల ప్రణాళికను చేపట్టిందన్నారు. మున్సిపాలిటీలోని భగత్ సింగ్ తండాలో రూ.15 లక్షలతో మురుగుకాల్వ, రూ.25 లక్షలతో కేశవనగర్‌లో సైడ్ డ్రెయినేజీ, రాఘవేంద్ర, బలరాం నగర్ కాలనీలో రూ.22 లక్షలతో సీసీ రోడ్డు, ప్రభుత్వ పాఠశాల ఆవరణలో రూ.10 లక్షలతో చేపట్టే వివిధ పనులకు శంకుస్థానలు చేశారు. అధేవిధంగా పోలీస్‌స్టేషన్ ప్రహరీ దగ్గర మెప్మా ఆధ్వర్యంలో చేతివృత్తుల ద్వారా నేసిన పలు వస్తువులకు సంబంధించిన స్టాళ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట వనమహోత్సవంలో భాగంగా ఎమ్మెల్యే మొక్కలను నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్, కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బందితో పాటుగా పలువురు పాల్గొన్నారు.

ఏకపక్షంగా వార్డుల విభజన సరికాదు



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

కొల్లాపూర్: మున్సిపాలిటీలో కొత్తగా చేపట్టిన వార్డుల విభజన ఏకపక్షంగా జరిగిందని బీజేపీ నాయకులు ఆరోపించారు. గురువారం వారు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసన్‌ను కలిశారు. వార్డుల విభజన అంశాలపై చర్చించారు. వార్డుల విభజనలో అఖిలపక్ష పార్టీల సలహాలు, సూచనలు స్వీకరించకపోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులకు అనుకూలంగా, వారి సూచనల ప్రకారమే వార్డుల విభజన చేపట్టడం సరైన పద్ధతి కాదన్నారు. అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. పట్టణంలో గతంలో మాదిరిగా 20 వార్డులు ఏర్పాటు చేయాలన్నారు. గతంలో వార్డుల విభజన సరిగ్గా జరగలేదని, పాత పద్ధతిలోనే ఈసారి కూడా వార్డుల విభజన జరిగిందన్నారు. ప్రజల అభీష్టం మేరకు వార్డుల విభజన జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. వార్డుల విభజన కోసం మరోమారు సమావేశం ఏర్పాటుచేయాలని, సమావేశానికి అఖిలపక్ష పార్టీలను పిలవాలని కోరుతూ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కాడం శ్రీనివాస్, నాయకులు కాశీపురం మహేష్, బడా చందు యాదవ్, బొమ్మరిల్లు భాస్కర్, బాలపీరు, సత్యం సాగర్, పాలడుగుల కురుమయ్య, మల్లిఖార్జున్, శ్రీను, అరుణ తదితరులు ఉన్నారు.

సబ్సిడీ విత్తనాల పంపిణీ



వెల్దండలో రైతులకు సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వెల్దండ: ప్రభుత్వం మంజూరు చేసిన సబ్సిడీ విత్తనాలను మండలంలోని రైతు వేదికల్లో గురువారం సింగిల్‌విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడ్, మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి పంపిణీ చేశారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, జిల్లాలోని పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ వారు సబ్సిడీలో విత్తనాలు అందించినట్లు వివరించారు. ఆముదం 2 కేజీలకు రూ. 850, జొన్న(పాలెం పచ్చజొన్న-1) 3 కేజీలకు రూ.450, జొన్న(తెలంగాణ జొన్న-1) 3 కేజీలకు రూ.270, కంది ఉజ్వల రకం 3 కేజీలకు రూ.450, కంది టీడీఆర్‌జీ -59రకం 3 కేజీలకు రూ.450, మినుము 6 కేజీలకు రూ.900, పెసర 6 కేజీలకు రూ.840, రాగి 2 కేజీలకు రూ.200, వరి ఆర్‌ఎన్‌ఆర్-15048 (తెలంగాణ సోన) 15 కేజీలకు రూ.795, వరి కేఎన్‌ఎం-1638(కూనారం వరి-2) 20 కేజీలకు రూ.1060 సబ్సిడీపై విత్తనాలను అందజేశారు. ప్రభుత్వం క్లస్టర్ పరిధిలోని ముగ్గురు రైతులను ఎంపిక చేసి మండలంలోని అన్ని క్లస్టర్‌లో సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోతీలాల్‌నాయక్, కిసాన్ నియోజకవర్గ అధ్యక్షుడు పర్వత్‌రెడ్డి, నాయకులు పుల్లయ్య, భరత్‌గౌడ్, ఆయా క్లస్టర్ ఏఈఓలు ప్రవీణ్, భిన్నతి, లక్ష్మీప్రసన్న, అభిబున్నీసా తదితరులు ఉన్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి



లింగాలలో సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ దమయంతి

లింగాల: బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని ఐసీడీఎస్ సీడీపీఓ దమయంతి కోరారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం బడిబాట నిర్వహణపై టీచర్లకు ఆమె అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీ నుంచి మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో బడిబాట నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. ఇంటింటికి తిరిగి బడి ఈడు పిల్లలను గుర్తించి అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలని సూచించారు. పిల్లల తల్లి దండ్రులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే సేవలను వివరించాలన్నారు. పూర్వ ప్రాథమిక విద్య ద్వారా పిల్లల్లో శారీరక, మానసిక పెరుగుదల కలుగుతుందన్నారు. బడి బాట ద్వారా కేంద్రాలలో పిల్లల సంఖ్య పెంచుటకు తగు శ్రద్ధ కనబర్చాలని సీడీపీఓ కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ గిరిజ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి



కల్వకుర్తి రూరల్: పంటల సాగులో శాస్త్రవేత్తల సూచనలు పాటించాలని ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు రాజశేఖర్, రామకృష్ణలు కోరారు. గురువారం పట్టణంలోని రైతు వేదికలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. పంటల తెగుళ్ల నివారణపై అవగాహన కల్పించారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ తలసాని జనార్దన్ రెడ్డి, వ్యవసాయ అధికారి సురేష్, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

వరి కొనుగోలులో జాప్యం

నాగర్‌కర్నూల్: వరి కొనుగోలులో జాప్యం చేయొద్దని అధికారులకు కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశించారు. గురువారం వరి కొనుగోలుపై అదనపు కలెక్టర్ పి అమరేందర్‌తో కలిసి పౌరసరఫరాలు, డీఎం సివిల్ సప్లై, డీఆర్డీఏ అధికారులతో సమీక్షించారు. లారీల ఏర్పాట్లు, హమాలీలు, రైస్ మిల్లు వద్ద ధాన్యం ఖాళీ చేయడంపై చర్చించారు. జిల్లాలో 25,453 మంది రైతులనుం ఇప్పటివరకు 1,48,407 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. రూ.314.65 కోట్లను రైతుల ఖాతాలో జమ చేసినట్లు వివరించారు. ఇంకా రూ.25 కోట్లు రైతుల ఖాతాల్లో జమ కావల్సి ఉందని తెలిపారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి నరసింహారావు, డీఎం సివిల్ సప్లై రాజేందర్, జిల్లా కోపరేటివ్ అధికారి, డీఆర్డీఏ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

గోవధను అరికడుదాం

మన్ననూర్: గోవుల వధను అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, అమరేశ్వర ఆలయ కమిటీ అధ్యక్షుడు గంగిశెట్టి నాగరాజు అన్నారు. గురువారం హిందు వాహిని, అమరేశ్వర దేవాలయం కమిటీ ఆధ్వర్యంలో పార్టీ నాయకులతో కలిసి అమ్రాబాద్ పోలీసు స్టేషన్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువులు దైవంగా పూజించే గోవులను రక్షించుకుందామన్నారు. పండుగల పేరుతో గోవులను చంపడం దారుణమన్నారు. ప్రజల మనోభావాలను గౌరవించి పశుసంపదను కాపాడాలని పోలీసులను విజ్ఞప్తి చేశారు. నోముల పరమేష్, నోముల శంకర్ గౌడ్, గణేష్, అక్షిత్, రాఖీ, రాజు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలు



కందనూలు: నాగర్‌కర్నూల్ మండలంలోని శ్రీపురం రంగనాథస్వామి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం అగ్నిప్రతిష్ఠ, హోమం, ధ్వజారోహణం, మధ్యాహ్నం గరుడ ముద్ద తదితర పూజా కార్యక్రమాలు కొనసాగాయి. సాయంత్రం భేరిపూజ, దేవతాహ్వానం తదితర పూజలు చేశారు. శుక్రవారం రంగనాయకస్వామి తిరుకల్యాణ మహోత్సవానికి ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



నాగర్‌కర్నూల్ రూరల్: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి అన్నారు. గురువారం సబ్సిడీపై మంజూరైన స్ప్రింక్లర్లను జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఆయన రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు స్ప్రింక్లర్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు, అధికారులు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంపాదకుడిపై కేసు ఎత్తేయాలి

అచ్చంపేట: గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గంలో పచ్చని పొలాలను విధ్వంసం చేస్తూ కాలుష్యాన్ని వెదజల్లుతున్న ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా రైతులు తిరగబడిన పోరాటంలో చెలరేగిన హింసకు బాధ్యుడిగా ఓ పత్రిక సంపాదకుడు రెహమాన్‌పై కేసు పెట్టడాన్ని టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చందునాయక్, జిల్లా గౌరవాధ్యక్షుడు శ్రీనివాసులు, జాతీయ కౌన్సిల్ మెంబర్ రావూఫ్‌లు గురువారం ప్రకటనలో ఖండించారు. బాధ్యతాయుతమైన పత్రిక ఎడిటర్‌పై అక్రమ కేసులు పెట్టడం అన్యాయమని పర్యావరణానికి, జల కాలుష్యానికి కారణమవుతున్న ఇథనాల్ ఫ్యాక్టరీ యాజమాన్యంపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. యాజమాన్యం ఇచ్చిన తప్పుడు ఫిర్యాదు చేయడం సరికాదని పేర్కొన్నారు.

ముగిసిన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం



కల్వకుర్తి రూరల్: మండలంలోని జంగారెడ్డిపల్లిలో ఆంజనేయస్వామి దేవాలయంలో మూడు రోజుల పాటు నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్‌తో పాటు పలువురు మాజీ ప్రజా ప్రతినిధులు ఉత్సవాలలో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ గోవర్దన్, రామకృష్ణ, గణేష్, పూరి రమేష్, జ్యోతయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని నిరసన

కల్వకుర్తి టౌన్: యువకుడి ప్రాణాలు తీసిన లారీ డ్రైవర్‌ను కాపాడేందుకు కొందరు కుట్ర చేస్తున్నారని ఆరోపిస్తూ గురువారం మృతుడి కుటుంబసభ్యులు రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చరణ్ (23) మృతిచెందిన విషయం విధితమే. పట్టణంలోని పాలమూరు చౌరస్తాలో కుటుంబసభ్యులతో పాటుగా గ్రామస్తులు నిరసనను తెలిపారు. మృతదేహాన్ని ఆస్పత్రిలో ఉంచి రోడ్డుపై బైఠాయించారు. లారీ డ్రైవర్ అజాగ్రత్తగా, నిర్లక్ష్యం కారణంగానే యువకుడు మృతిచెందాడని ఆరోపించారు. లారీ యజమానికిపై కేసు నమోదు యువకుడి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ట్రాఫిక్ జాం కావడంతో పోలీసులు వాహనాలను ఇతర రూట్లలో మళ్లించి ట్రాఫిక్ జామ్ కాకుండా చర్యలు తీసుకున్నారు. పోలీసులు నచ్చజెప్పడంతో నిరసనను విరమింపచేశారు.

మండల మహాసభను విజయవంతం చేయాలి



నాగర్‌కర్నూల్ రూరల్: మండలంలోని కుమ్మెరలో శుక్రవారం నిర్వహించే సీపీఐ మండల సభను విజయవంతం చేయాలని నాయకులు మారెడు శివ శంకర్ కోరారు. గురువారం మండలంలోని గగ్గలపల్లి, పుల్జాల గ్రామాల్లో గ్రామశాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి మర్యాద వెంకటయ్య, రామకృష్ణ, రాముడు, వెంకటయ్య, బుచ్చన్న, గొల్ల రమేష్, వెంకటమ్మ, పాల్గొన్నారు.

నేటి నుంచి బడిబాట

కోడేరు: మండలంలోని ప్రతి పాఠశాలలో బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ భాస్కర్‌శర్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బడిబాట కార్యక్రమానికి ప్రతి ఉపాధ్యాయుడు హాజరై బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని కోరారు.

పాన్‌గల్: చదువుకు దూరమైన పిల్లలను బడుల్లో చేర్పించడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ మేరకు 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి మండలంలో ఈనెల 6 నుంచి 19వ తేదీ వరకు ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

బాలిక అదృశ్యం

నాగర్‌కర్నూల్ క్రైం: బాలిక అదృశ్యమైన ఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గగ్గలపల్లి గ్రామానికి చెందిన బాలికకు ఈ సంవత్సరం నుంచి చదువొద్దని తెలపడంతో దీంతో మనస్తాపానికి గురై ఇంటి నుంచి బయటకు వెళ్లింది. కుటుంబసభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధిత కుటుంబసభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఒకరికి జైలుశిక్ష

ఊర్కొండ: డ్రంకెన్‌డ్రైవ్‌లో ఒకరికి జైలుశిక్ష, మరో ఇద్దరికి జరిమానా విధించిన ఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ కృష్ణదేవ తెలిపిన వివరాల ప్రకారం వాహన తనిఖీలో మద్యం తాగి వాహనం నడుపుతూ ముగ్గురు పట్టుబడ్డారు. కేసు నమోదు చేసుకొని న్యాయమూర్తి ఎదుట వారిని హాజరపరిచారు. ఒకరికి ఒక రోజు జైలు శిక్ష, మరో ఇద్దరికి రు. 1500 చొప్పున జరిమానా విధించారని ఎస్‌ఐ తెలిపారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం



అచ్చంపేటలో మొక్క నాటుతున్న అటవీశాఖ సిబ్బంది

కందనూలు: పర్యావరణాన్ని కాపాడుకుందామని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మదన్‌మోహన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడటమంటే భవిష్యత్ తరాలకు మంచి జీవన వాతావరణం అందించటమేనన్నారు. కార్యక్రమంలో కళాశాల ఏఓ మహమ్మద్ ఇర్ఫాన్, అధ్యాపకులు అంజయ్య, ఉమాదేవి, రామకృష్ణ, ముజఫర్ తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ర్యాలీ

అచ్చంపేట రూరల్: పట్టణంలోని అటవీశాఖ కార్యాలయంలో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి

బల్మూర్: ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ వాడకాన్ని తగించి పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలని వైద్యాధికారిణి డా.కల్పన కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వల్ల కలిగే అనార్థాలను వివరించారు. కార్యక్రమంలో ఫార్మసి ఆఫీసర్ శ్రీనువాసులు, సూపర్‌వైజర్ ఉమా, సిబ్బంది రెడ్యా, రాంపాల్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.